www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 9 జులై 2023

11న శ్రీవారి ఆలయంలో బ్రేక్ దర్శనాలు రద్దు

ప్రజాశక్తి- తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో జూలై 17వ తేదీన సాలకట్ల ఆణివార ఆస్థానం పర్వదినాన్ని పురస్కరించుకుని జూలై 11వ తేదీన మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో జూలై 11న బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. ఈ కారణంగా జూలై 10న సోమవారం సిఫారసు లేఖలు స్వీకరించబడవు. ఈ విషయాన్ని భక్తులు గమనించాలని కోరడమైనది.

49,298 మందికి రూ.9.93 కోట్లు లబ్ధి : కలెక్టర్

లబ్ధిదారులకు చెక్కును అందిస్తున్న డిప్యూటీ సీఎం, కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రైతు భాంధవుడు దివంగతనేత వైఎస్.రాజశేఖరరెడ్డి అని ఆయన అడుగుజాడల్లో నడుస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ అభివద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి కె. నారాయణ స్వామి తెలిపారు. శనివారం వరుసగా నాలుగో ఏడాది 2022 ఖరీఫ్‌లో పంట నష్టపోయిన రైతులకు డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పరిహారాన్ని కంప్యూటరు బటన్ నొక్కి విడుదల చేసే కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి అనంతపురం జిల్లా, కల్యాణదుర్గంలో లాంఛనంగా ప్రారంభించారు. ఈకార్యక్రమంలో భాగంగా జిల్లాస్థాయి కార్యక్రమం గంగాధర నెల్లూరు మండలం పాపిరెడ్డిపల్లిలో జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ ముఖ్య అతిథులుగా విచ్చేయగా, చిత్తూరు ఎంఎల్‌ఎ ఆరణిశ్రీనివాసులు, చిత్తూరు నగర మేయర్ అముద, ఎపి ఎస్ ఆర్‌టిసి వైస్‌చైర్మన్ విజయానంద రెడ్డి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ జోనల్ ఛైర్‌పర్సన్ శైలజా రెడ్డి, జడ్పీ మహిళా స్థాయి సంఘ చైర్‌పర్సన్ భారతి పాల్గొన్నారు. ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ రైతుల కష్టాలను అర్థం చేసుకున్న ముఖ్యమంత్రి వరుసగా నాలుగో ఏడాది ఖరీఫ్‌లో పంట నష్టపోయిన రైతులను ఆదుకునే విధంగా రైతు దినోత్సవం రోజున డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా ద్వారా నష్టపరిహారం చెల్లించడం జరుగుతున్నదన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ కరువు ప్రాంతాలలో వర్షాభావం వలన పంట నష్టపోవడం జరుగుతుందని, అలా కాకుండా రైతు పంటకు బీమా కల్పించి, పంటనష్టం జరిగినప్పుడు వారికి నష్ట పరిహారం చెల్లించడం జరుగుతున్నదన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటబీమా కింద జిల్లాలోని 49,298 మంది రైతులకు రూ.9.93 కోట్లు ముఖ్యమంత్రి డిబిటి పద్ధతి ద్వారా రైతుల ఖాతాలకు నేరుగా జమ చేయడం జరిగిందని తెలిపారు. ఈ-క్రాప్ నమోదు ద్వారా పంట నష్టపోయిన ప్రతి రైతుకు నష్టపరిహారం చెల్లించే చర్య తీసుకుంటున్నామని తెలిపారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటను కాపాడుకోవడానికి చిరుధాన్యాల సాగును జిల్లాలో ప్రోత్సహించడం జరుగుతున్నదని, రైతులు ఆదిశగా అడుగులు వేయాలన్నారు. జిల్లాలో 15 వేల హెక్టార్లలో చిరుధాన్యాల పెంపకానికి వ్యవసాయశాఖ ద్వారా చర్యలు తీసుకుంటున్నామని, ఆర్‌బికెల ద్వారా రాగి పంటకు విత్తనాలు పంపిణీ చేయడం, చిరుధాన్యాలు పండించే రైతులకు ప్రభుత్వం ద్వారా ప్రోత్సాహకాలు అందించడం జరుగుతుందన్నారు. పండించిన రాగి పంటను పూర్తిగా ఆర్‌బికెల ద్వారా క్వింటాల్‌కు రూ.38 వేలు గిట్టుబాటు ధర చెల్లించి ప్రభుత్వం కొంటుందని దీనితో రైతులకు ఆదాయం చేకూరుతుందని తెలిపారు. వ్యవసాయ, ఉద్యాన వన, పశు సంవర్ధక, పట్టు పరిశ్రమల శాఖలచే ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఉప ముఖ్యమంత్రి, కలెక్టర్, ప్రజాప్రతి నిధులు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక శాఖల అధికారులు మురళీకష్ణ, మధుసూదన్ రెడ్డి, ప్రభాకర్, ఎల్‌డిఎం హరీష్, ఎంపిపి అనిత, తహసీల్దార్ ఇన్బనాధన్, ఎంపిడిఓ శ్రీదేవి, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

క'రెంట్'కష్టాలు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ:

అది చంద్రగిరి నియోజకవర్గంలోని భీమవరం గ్రామం ఓ రచ్చబండ వద్ద అడవికి మేకల తోలి కెళ్ళి అప్పుడే ఇంటికి వచ్చి, కాసేపు విశ్రాంతి తీసుకునేందుకు ఆ రచ్చబండ వద్ద నాగప్ప కూర్చొని ఉన్నాడు. సమీపంలోని ఏ రంగంపేట వద్ద హోటల్‌లో పనిచేస్తున్న సుబ్బయ్య అటుగా వెళ తున్నాడు. అతన్ని చూసి నాగప్ప ఏరా సుబ్బిగా... మూడు రోజులుగా కనిపించట్లేదు... రాత్రి 8 గంటలకు మీ ఇంటికి వస్తే కూడా దీపాలని ఆరిపోయి ఉన్నారు ఏంటి కథ. ఎక్కడికి వెళ్ళావ్ ఏంటి... అంటూ పలకరించాడు. కథలేమి ఉంటాయి నాగమామ. పనికాడనుండి ఇప్పుడే వస్తా ఉండ. కొన్ని రోజులుగా పెందలకాడే పడుకునేస్తున్నావ్ మామ. అందుకే దీపాలన్నీ ఆరిపేస్తున్నాం. ఇంట్లోనే ఉన్నాను తెలిసి ఉంటే బయట వచ్చి ఉంటా అని సమాధానం ఇచ్చాడు. అదేందిరా అంత పెందలాకాడే పడుకుంటావా.., ఏం చెప్పేది మామ నేను పగలంతా కష్టపడితే రోజుకు 300 రూపాయలు కూలీ కూడా రావడం లేదు. నెలకు పదివేల మించి సంపాదించలేకపోతున్నాం. ఆ వచ్చిన డబ్బుని

ప్రజా'దృష్టి'

పిల్లలు స్కూల్ ఫీజులుకి, పుస్తకాలకి, తిండికే సరిపోవటం లేదు. ఇది చాలుదన్నట్టు రెండు లైట్లు ఒక ఫ్యాన్ ఉన్న మా ఇంటికి గత మూడు నెలలుగా కరెంట్ బిల్లు రూ.1000లు దాటిపోతుంది. ఇంతకుముందు నేలకు రూ.200, 250లు వచ్చేది. ఒకసారిగా నాలుగు రెట్లు పెరిగిపోతే ఎలా భరించేది మామ. అందుకే పొద్దుగూకంగానే పడుకునేస్తూ, లైట్ల అరిపిస్తే కాస్త బిల్ అన్న తగ్గుతుందని మామ అంతే. అవును రా సుబ్బిగా మా ఇంట్లో అయితే రోజు గొడవే. సాయంత్రం పూట కాసేపు టీవీ చూద్దామంటే, నా కొడుకు కోడలు మధ్య ఒకటే గొడవే. కరెంట్ ఛార్జ్ ఎంత వస్తుంది ఏది ఎంత వాడాలో తెలియటం లేదా అంటే కలుసుకుంటున్నారు. ఏం గవర్నమెంట్ ఏమో... మనకేమైనా చేస్తుందనుకుంటే.... మన దగ్గరే పిండేస్తున్నారు. అంటూ ఆవేదన వ్యక్తం చేశాడు నాగప్ప. ఈ సంభాషణ అంతా అదే రచ్చ పైన కూర్చొని ఉంటున్న చిన్నస్వామి స్పందిస్తూ.... చాల్లే మామ బామ్మర్ది సంబడాలు... మీ ఇంట్లోకి మాత్రమే కాదు ఇది... కరెంట్ బిల్లు సమిసే ప్రతి ఇంట్లోనే ఉంది. ఈ కరెంటు వల్ల ఇంట్లోకి వెలుగు వస్తుంది అనుకుంటే.... ఆ బిల్లు చెల్లించేందుకు... బతుకులే చీకటమయం అయ్యేలా ఉన్నాయంటూ ఆక్రోసం వెళ్లగొక్కాడు.

నిజమే కదా... ఇది సుబ్బయ్య, నాగప్ప, చిన్నస్వామి, ఇళ్లలోన.... భీమవరం అంటే ఒక ఊరుకో సంబంధించిన సమస్య కాదు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యుత్ వినియోగదారులు గత మూడు నెలలుగా ఎదుర్కొంటున్న సమస్య. ప్రస్తుతం వినియోగదారులు రాష్ట్రంలో కరెంటు కష్టాలను అనుభవిస్తున్నారు. మినిమం చార్జి రూ.75లు వచ్చే అత్యంత నిరుపేద కుటుంబాలకు సైతం ఐదు, ఆరు వందల రూపాయలు కరెంట్ బిల్లులు వేస్తుండడం బాధాకరం. ఏప్రిల్ నెల కరెంట్ బిల్లు ఎక్కువ వస్తే వ్యాసవి వల్ల వచ్చిందేమో అనుకోని సర్దుకున్నారు. తిరిగి జూన్లో కూడా అలాగ వస్తే అవాకయ్యారు. వినియోగదారులు స్పందించి రోడ్డుపైకి వచ్చారు. అయినా డిస్కం ముందుగా వ్యవహరిస్తూ జూలై నెలలో కూడా మరింత భారాన్ని మోపారు. ప్రజాస్వామ్య పద్ధతిలో పాలన సాగించాల్సిన ప్రభుత్వాలు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాల్సిన పాలకులు. ప్రజల భారాలు వేయడం శోచనీయం. మరీ విచిత్రంగా ఏడు, ఎనిమిది సంవత్సరాలకు ముందు వాడిన విద్యుత్‌కు ఇప్పుడు, అరియర్స్ , ట్రూఅఫ్ చార్జీలు, ఇతరాత్రా పేరుతో భారాలు మోపడం గమనార్హం. వినియోగదారులకు రక్షణగా ఉంటూ, యాజమాన్యానికి సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన విద్యుత్ నియంత్రణ మండలి చోద్యం చూస్తూ ఉండడం బాధాకరం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెంచిన విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలని వామపక్ష పార్టీలు, విద్యుత్ వినియోగదారులు కోరుతున్నారు.

సిపిఎస్ రద్దు చేయాలి

కలెక్టరేట్ ఎదుట నిరసన

సిపిఎస్ ఉద్యోగుల పోరాటానికి మద్దతు తెలియజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ శనివారం జిల్లా కలెక్టరేట్ ఎదుట సిపిఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ప్రతిఘటన పేరుతో భారీ నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా సిపిఎస్ ఉద్యోగుల సంఘం నాయకులు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర సందర్భంగా సిపిఎస్ ను రద్దు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎస్‌ను రద్దు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం కాంట్రిబ్యూటరీ పెన్షన్ కిందికి వచ్చే ఉద్యోగ ఉపాధ్యాయులను అన్యాయం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎస్ ఉద్యోగుల పోరాటానికి యుటిఎఫ్ జిల్లా నేతలు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు.

రూ.50.40 లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభం



ప్రజాశక్తి- నగరి: మండలంలో చేపట్టిన రూ.50.40ఃలక్షల అభివృద్ధి పనులను మంత్రి ఆర్కేరోజా శనివారం ప్రారంభించారు. బుగ్గఅగ్రహారంలో నాలుగు దశాబ్దాలుగా ఉన్న తాగునీటి సమస్యను పరిష్కరించారు. గ్రామానికి సుదూర ప్రాంతంలో ఉన్న కొండ అంచున అడవిచేను నుంచి 5.5కిలోమీటర్లు పైపులైన్ల ద్వారా బుగ్గఅగ్రహారం వరకు తాగునీటిని అందించారు. ఈ ప్రక్రియకు జలజీవన్ మిషన్, సీఎండీఎఫ్, జిల్లాపరిషత్, మండల పరిషత్ నిధులు కలిపి రూ.34.30 లక్షలు ఖర్చు చేసి తాగునీటి సౌకర్యం కల్పించారు. అలాగే నగరి పట్టణంలోని వెటర్నరీ ఆస్పత్రి ఆవరణలో రూ.16.10 లక్షల వ్యయంతో ఏర్పాటుచేసిన పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివద్ధి, సంక్షేమం సమపాళ్లలో రాష్ట్రంలో అమలౌతోందన్నారు. ప్రతి చిన్న అంశాన్ని పరిశీలించి మరీ జగనన్న చేపడుతున్నారన్నారు. ఇందుకు జిల్లాకు ఒకటి ఉన్న పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలలు నేడు నియోజకవర్గానికి ఒకటి ఏర్పాటుకావడమే సాక్ష్యమన్నారు. ప్రజారోగ్యంతో పాటు, మూగజీవాల ఆరోగ్యానికి కూడా జగనన్నప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు మధుసూధన్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ పీజీ నీలమేఘం, ఎంపీపీలు భార్గవి, ధీప, పుత్తూరు, చిత్తూరు వెటర్నరీ డీడీలు టి.గోవిందయ్య, మణాళిని, నగరి, పుత్తూరు, నింద్ర ఏడీలు ఆర్.వాసు, ఎస్.గురునాథ్, లక్ష్మీపతి, తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో లీలామాధవి, పశువైద్యులు కష్ణ, శివమూర్తి హేమకుమార్, చైతన్య, వరప్రసాద్, ల్యాబ్ అసిస్టెంట్ ధీప, నాయకులు చంద్రారెడ్డి, దయానిధి, రవికుమార్, చంద్రకళ, వేలాయుధం, ఆనంద్‌కుమార్, మురుగ, ఎల్లప్పరెడ్డి, సాయిసంధ్యారాణి, తేన్‌మొళి, ప్రకాష్, గోపాలమిత్రలు, పశు వైద్య సహాయకులు పాల్గొన్నారు.

నేడు వర్చువల్ విధానంలో

ఒబెరాయ్ హోటల్‌కు సిఎంచే శంకుస్థాపన

ఏర్పాట్లను పరిశీలించిన జెసి బాలాజీ

ప్రజాశక్తి- తిరుపతిటౌన్: ఈనెల 9న సోమవారం తిరుపతి పట్టణంలో ఒబెరాయ్ హోటల్‌కు వర్చువల్ విధానంలో ముఖ్యమంత్రి శిలాఫలకం ఆవిష్కరించి శంకుస్థాపన చేయనున్నారు. ఈనేపథ్యంలో తిరుపతి జిల్లా జెసి డికే.బాలాజీ ఏర్పాట్లను శనివారం ఉదయం పరిశీలించి ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈసందర్భంగా జెసి మాట్లాడుతూ ఒబెరాయ్ గ్రూపు ఆఫ్ హోటల్స్ సంబంధించి కడప జిల్లా గండికోట నుండి వర్చువల్ విధానంలో తిరుపతి పట్టణంలోని ఏపీ టూరిజం శాఖ ట్రాన్స్‌ఫోర్ట్ ఆఫీస్ (పేరూరు - అలిపిరి రోడ్డు) దగ్గర సదరు హోటల్‌కు కేటాయించబడిన స్థలంకు సంబంధించిన శిలా ఫలకంను ముఖ్యమంత్రి ఆవిష్కరించి శంకుస్థాపన చేయనున్నారని, ఈనేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు చేపడుతున్న ఏర్పాట్లలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కోదండ రామిరెడ్డి, పర్యాటకశాఖ ఆర్‌డి రమణప్రసాద్, జిల్లా సమాచార పౌర సంబంధాలశాఖ అధికారి బాలకొండయ్య, పర్యాటక కార్పొరేషన్ డివిఎం గిరిధర్, జిల్లా టూరిజం అధికారి రూపేంద్రనాథ్ రెడ్డి, ఏపీ ఎస్పీడీసీఎల్ అధికారులు, రూరల్ తహశీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిల నిర్వాకం

వ్యవసాయ గోదాముల మధ్య మంటలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ఆకతాయిల నిర్వాకం వల్ల స్థానిక శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డ్ ఆవరణలో ఉన్న రెండు గోదాముల మధ్య శనివారం మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన అగ్నిమాపక సిబ్బంది సకాలంలో మంటలను అదుపు చేయడంతో పెనుప్రమాదం తప్పింది. వివరాల్లోకి పోతే.. వ్యవసాయ గోదాముల చివరన వాడేసిన బ్యానర్లు ఫ్లెక్సీలను నిల్వ ఉంచారు. ఈ క్రమంలో అటుగా వచ్చిన ఆకతాయిలు నిప్పు పెట్టారు. దీంతో పెద్దఎత్తున మంటలు వ్యాపించాయి. స్థానికులు గుర్తించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. గోదాము నెం.2లో రైతులు నిల్వ చేసుకున్న ధాన్యం ఉండగా, గోదాము నెం.3లో రైతు భరోసా కేంద్రం ల్యాబ్ పరికరాలు ఉన్నాయి. అయితే గోదాముల్లోకి మంటలు వ్యాపించే లోపే అదుపు చేయడంతో భారీ నష్టం వాటిల్ల లేదని ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

టీటీడీ వెబ్‌సైట్‌లో ఆలయాల సమాచారం

జేఈవో వీరబ్రహ్మం

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం): టీటీడీ వెబ్సైట్లో స్థానిక ఆలయాలు, అనుబంధ ఆలయాల సమాచారం అప్లోడ్ చేయడానికి చర్యలు తీసుకోవాలని జేఈవో వీరబ్రహ్మం అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన ఆలయాల డెప్యూటీ ఈవోలు ఇతర అధికారులతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆలయాల సందర్శనకు వచ్చే భక్తుల సౌలభ్యం కోసం ఆయా ఆలయాల స్థల పురాణం, దూరం, వీటికి సంబంధించిన సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ఆలయాల విశిష్టతపై వివిధ బాషల్లో సంక్షిప్త సమాచారం పొందుపరచాలన్నారు. ఇందుకోసం ఐటీ, పిఆర్వో విభాగాలతో సమన్వయం చేసుకుని త్వరలో వెబ్సైట్లో ఆలయాల సమాచారం, సేవలు, దర్శన వేళలు ఆలయాల్లో భక్తులకు ఉన్న సదుపాయాలు తదితర విషయాలన్నీ పొందుపరచాలని వీరబ్రహ్మం సూచించారు. ఎస్వీ బీసీతో సమన్వయం చేసుకుని ఆలయాల సమాచారానికి సంబంధించిన ప్రోమోలు విడుదల చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఆలయంలో ఉభయ దారులను ప్రోత్సహించేలా చూడాలన్నారు. భక్తుల కనీస అవసరాలైన తాగునీరు, మరుగుదొడ్లు చక్కగా నిర్వహించాలన్నారు. నగరి, నారాయణవనం, బుగ్గ ఆలయాలకు టూరిజం బస్సులు వచ్చేలా ఆయా అధికారులతో చర్చించాలని ఆయన చెప్పారు. రిషికేష్, కురుక్షేత్ర, కన్యాకుమారి ఆలయాల అధికారులు కూడా ఆయా రాష్ట్రాల టూరిజం అధికారులతో మాట్లాడి ఆలయాల ప్రాశస్త్యాన్ని తెలియజేసి యాత్రికుల బస్సులు ఆలయానికి వచ్చేలా చూడాలన్నారు. కొత్తగా నిర్మించిన రంపచోడవరం, సీతంపేట, జమ్ములాంటి ఆలయాల్లో భక్తుల సంఖ్య పెంచడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డెప్యూటీ ఈవోలు గోవిందరాజన్, ఝాన్సీ, వరలక్ష్మి, విజయకుమార్, దేవేంద్రబాబు, రమేష్ బాబు, ఎస్టేట్ ఆఫీసర్ లక్ష్మణ్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడులు చేయడం హేయమైన చర్య

ప్రజా సంఘాల నాయకులు

పర్యటనలో భాగంగా మాట్లాడుతున్న కెవిపిఎస్ నాయకులు

ప్రజాశక్తి- పెద్దపంజాణి: మండలం నెర్నిపల్లి గ్రామంలో దళితుడైన గట్టప్ప అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నట్లు కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం, జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్య, వ్యవసాయ కార్మిక సంఘం, జిల్లా కార్యదర్శి ఓబులరాజు, ఐద్వా మహిళా సంఘం జిల్లా కన్వీనర్ భువనేశ్వరి తెలిపారు. శనివారం ప్రజాసంఘాల నాయకులు నెర్నిపల్లి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక తహశీల్దార్‌ను కలిసి దళితులపై దాడులు చేసిన విషయాన్ని అలాగే వారు చేసుకుంటున్న భూవివరాలను తెలియజేసి సమగ్ర విచారణ చేసి దళితులు సాగు చేసుకుంటున్న భూమిని వారికి అప్పగించాలని తహశీల్దార్‌ను కోరారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలోని నెర్నిపల్లి గ్రామంలో గత 40 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న భూమిలోకి అదే గ్రామానికి చెందిన కురబ కులానికి చెందిన వెంకటరమణ వారి కుటుంబ సభ్యులు, దళితులపై వారిపై దాడులు చేయడం హేయమైన చర్యని అన్నారు. అదేవిధంగా దళితుల్ని కులం పేరుతో దూషించి వారిపైన భౌతికదాడులు చేయడమే కాకుండా దళితుల నిర్మించుకున్న ఇంటిని కూడా కూల్చి వేసినట్లు తెలిపారు. దళితులు సాగు చేసుకుంటున్న భూమిలోకి ప్రవేశించి అడ్డుకోబోయిన దళితులను దాడిచేసి తిరిగి దళితులపై కేసు కట్టి దళితులను అరెస్టు చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దళిత ప్రజాసంఘాల నాయకులు పాకాల సుబ్రహ్మణ్యం, గుర్రం సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

జి-20 సమ్మిట్‌లో మేయర్ డాక్టర్ శిరీష

ప్రజాశక్తి- తిరుపతిటౌన్: తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీషకు అరుదైన గౌరవం లభించింది. గుజరాత్ రాష్ట్రం, అహ్మదాబాద్‌లో జరుగుతున్న అంతర్జాతీయ అర్బన్ 20 సమ్మిట్‌లో సమ్మిట్‌లో రాష్ట్రం నుంచి తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, విశాఖపట్నం మేయర్ హాజరయ్యారు. 70 దేశాలకు చెందిన ప్రతినిధులు, మేయర్లు, అధికారులు పాల్గొన్నారు. ఇందులో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా అహ్మదాబాద్‌లో మేయర్ నివాళి అర్పించారు. శనివారం గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో జరుగుతున్న జాతీయ, అంతర్జాతీయ మేయర్ల సదస్సులోనూ.. వైఎస్సార్ సేవలు మరువలేనివని పలు దేశాల మేయర్లు కొనియాడడం గమనార్హం. అహ్మదాబాద్‌లో జీ-20, అర్బన్-20 సమావేశాల్లో వైఎస్ జయంతి వేడుకల్ని మేయర్ శిరీషా ఆధ్వర్యంలోనూ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి విశాఖపట్నం మేయర్ హరివెంకట కుమారి సహా భూటాన్, జపాన్ మేయర్లు కూడా ఘనంగా నివాళులర్పించారు. వైఎస్ మరణాంతర పరిణామాల్ని ఈ సందర్భంగా అక్కడి వారంతా గుర్తు చేసుకున్నారు. సీఎంగా వైఎస్‌తో తమకున్న జ్ఞాపకాల్ని గుర్తుచేసుకున్నారు.

10 కేజీల అక్రమ గంజాయి పట్టివేత- ఆరుగురు అరెస్టు

ప్రజాశక్తి- పలమనేరు: అక్రమంగా గంజాయి వ్యాపారం చేస్తున్న ఆరుగురు వ్యక్తులు అరెస్టు చేసి వారి వద్దనుండి సుమారు రెండులక్షల 80వేల రూపాయల విలువ గల 10కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పలమనేరు డిఎస్పి సుధాకర్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని స్థానిక పోలీస్ స్టేషన్ శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. పట్టణంలోని గంటావూరు శ్రీఆంజనేయ స్వామి గుడి వెనుక భాగంలో ఆరుగురు వ్యక్తులు కలిసి గంజాయి వ్యాపారం చేస్తున్నారనే సమాచారంపై అర్బన్ సిఐ చంద్రశేఖర్ మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ కుప్పస్వామి సబ్‌ఇన్స్పెక్టర్ సుబ్బారెడ్డి, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని చూడగా అక్కడ ఐదుగురు పురుషులు, ఒక మహిళతో ఉండి అక్రమ రవాణా ద్వారా తెచ్చిన గంజాయి ప్యాకెట్లను ఇస్తూ ఉండగా వారిని పట్టుకొని విచారణ చేపట్టడం జరిగిందన్నారు. వారిలో గుంటూరు జిల్లా శావల్యాపురంకు చెందిన గంటా వెంకటేశ్వర్లు అతని భార్య భాగ్యమ్మ ఇద్దరూ మదనపల్లి వాసులుగా ఉంటూ వారు కూలిపనులు చేసి వచ్చే సంపాదన సరిపోక అక్రమంగా గంజాయిని తెచ్చుకొని ఇక్కడ అధిక ధరకు అమ్మాలని నిర్ణయించుకున్నారని తెలిపారు. వారిద్దరూ నాలుగైదుసార్లు వైజాగ్‌కు వెళ్లి అక్కడ వాళ్ళకు తెలిసిన వ్యక్తికి ఫోన్ చేస్తే, అతను వీళ్ళకు కావాల్సినంత గంజాయిని వైజాగ్, రైల్వే స్టేషన్ కు తీసుకొని వచ్చి ఇచ్చేవాడనన్నారు .అప్పుడు వీళ్ళు అతనికి 2 కేజీల బరువు కలిగిన గంజాయి ప్యాకెట్‌కు రూ.7వేల చొప్పున డబ్బులు ఇచ్చి తీసుకొని వచ్చి వాళ్ళ ఇంటి వద్ద పెట్టుకొని కావాల్సిన వాళ్ళకు అమ్ముతున్నారని తెలిపారు. అయితే పలమనేరు టౌన్‌కు చెందిన (పరారీలో ఉన్న) ఒక వ్యక్తి ద్వారా గంట వెంకటేశ్వర్లు అతని భార్య భాగ్యమ్మ ఇద్దరూ పరిచయమై బోయవీధికి చెందిన మైనర్ బాలుడు, అతని స్నేహితుడు ఇద్దరూ మూడుసార్లు మదనపల్లికి వెళ్లి 2 కేజీల బరువు కలిగిన గంజాయి ప్యాకెట్‌ను 28వేలకు కొనుక్కొని వచ్చి పలమనేరు టౌన్‌లో చిరంజీవికి ఇస్తే, అతని స్నేహితులైన యాసిన్‌తో పాటు మరికొందరికి అధికధరలకు అమ్ముకునే వారని అన్నారు. గంజాయిని వీరందరూ 25 గ్రాములు, 50 గ్రాములు చొప్పున ఒక్కొక్క ప్యాకెట్‌లో నింపి దాన్ని రూ500ల నుంచి 1000లకు పలమనేరు టౌన్‌లోని యువకులకు అమ్ముతున్నారని తెలిపారు. అలాగే జల్బార్ అను వ్యక్తి కూడా మదనపల్లికి వెళ్లి వీరి వద్ద గంజాయిని కొనుక్కొని వచ్చి ఇక్కడ అతని స్నేహితులకు ఇచ్చి, ఆ గంజాయిని చిన్నచిన్న ప్యాకెట్ల రూపంలో అమ్మడం ప్రారంభించారు. అయితే ఇక్కడ ఎవరి వద్ద గంజాయి లేనందున, మదనపల్లికి చెందిన భాగ్యమ్మకు మైనర్ బాలుడు, జబ్బార్, చిరంజీవికి ఫోన్‌చేసి ఇక్కడికి వాళ్ళను గంజాయి తీసుకోని రమ్మని చెప్పారు. దీంతో భార్యభర్తలిద్దరూ శనివారం ఇక్కడికి తీసుకొని వచ్చి అమ్ముతూ ఉండగా అరెస్టు చేసి విచారించగా నేరాన్ని ఒప్పుకున్నట్లు తెలిపారు. వీరి వద్ద నుండి 10కిలోల గంజాయిని స్వాధీనపరచుకున్నట్లు తెలిపారు. ఈకేసులో సంబంధం ఉన్న ఇంకా నలుగురు, వైజాగ్‌కు చెందిన వ్యక్తిపై విచారణ జరుగుతున్నదన్నారు. వారిని త్వరలో పట్టుకొని అరెస్టు చేయడం జరుగుతుందన్నారు. పై ముద్దాయిలపై ఎన్‌డిపిఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచడం జరుగుతుందన్నారు. ఈకేసులో అత్యంత ప్రతిభ కనబరిచిన క్రైమ్ పార్టీ సిబ్బంది ఏఎస్ఐ శ్రీనివాసులు నాయుడు, పిసిఎస్ అల్లావుద్దీన్, ప్రకాష్ నాయుడు, అశోక్‌లను డిఎస్పి సుధాకర్ రెడ్డి అభినందించారు.

'భగత్ సింగ్ ఉచిత ట్యూషన్' సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి- తిరుపతిటౌన్: భగత్ సింగ్ ఉచిత ట్యూషన్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఐద్వా జిల్లా కార్యదర్శి డాక్టర్ పి.సాయిలక్ష్మి, డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.జయచంద్ర, జిల్లా అధ్యక్షులు ఎం.నరేంద్ర, సోము, భాను తెలిపారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ, ఐద్వా, మేక్ మై బేబీ జీనియస్ స్కూలు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భగత్ సింగ్ ట్యూషన్‌కు సంబంధించిన కరపత్రాన్ని ఆదివారం సుందరయ్య నగర్‌లోని ట్యూషన్ సెంటర్‌లో ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ట్యూషన్ సెంటర్ ద్వారా పిల్లల్లో ఉన్న ఆలోచనలకు పదును పెట్టే విధంగా విద్యను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే విద్యార్థులకు ఉపయోగపడేలా స్పోకెన్ ఇంగ్లీష్, తెలుగు, ఇంగ్లీష్ తప్పులు లేకుండా చదవడం, రావడం, సబ్జెక్టుల్లో వచ్చిన అనుమానాలు నివృత్తి చేయడం జరుగుతోందన్నారు. రోజూ సాయంత్రం6 నుంచి 8.30గంటల వరకు ట్యూషన్ నిర్వహించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 94903 00496 నంబర్‌ను సంప్రదించాల్సిందిగా కోరారు.

పేదల నాయకుడు వైఎస్ఆర్

■ ఘనంగా వాడవాడలా జయంతి

ప్రజాశక్తి-నగరి: మహానేత వైఎస్ఆర్ ఘనతను చరిత్ర మరవదని, పేదలకు సేవచేయడానికే పుట్టి వారికి సేవచేసే భాగంలోనే ప్రాణాలు కోల్పోయిన త్యాగమూర్తి వైఎస్ఆర్ అని రాష్ట్ర సాంకేతిక, పర్యాటక, యువజనసర్వీసులు, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా శనివారం కొనియాడారు. మహానేత జయంతిని పురస్కరించుకొని మండలంలోని బుగ్గ అగ్రహారం గ్రామంలో సంద్రంలా కదలివచ్చిన జనంతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించిన ఆమె బుగ్గఅగ్రహారం కూడలి వద్ద మహానేత నూతన విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు మధుసూధన రెడ్డి, మంత్రి సోదరులు రామ్‌ప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, నగరి, నింద్ర ఎంపీపీలు భార్గవి, దీప, వైస్‌ఎంపీపీలు డిల్లి, కన్నియప్ప, నగరి, నింద్ర, విజయపురం మండలాల నాయకులు పాల్గొన్నారు.

సోమల: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను మండల కేంద్రమైన సోమల బస్టాండ్ కూడలిలో ఘనంగా నిర్వహించారు. వైఎస్ఆర్ విగ్రహానికి ఎంపీపీ ఈశ్వరయ్య, మండల వైసీపీ అధ్యక్షులు గంగాధర రాయల్, సీనియర్ నాయకులు వరదం వెంకటరమణ తదితరులు పూలమాలవేసి అంజలి ఘటించారు. అనంతరం కేక్ కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీరాములు, ఎస్ నడింపల్లి వెంకటరమణ, వైస్ ఎంపీపీ ప్రభాకర, కందూరు మెకానిక్ భాష, సర్పంచ్ రెడ్డప్ప, వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వి.కోట: మండల కేంద్రమైన వి.కోటలో దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను శనివారం ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ కూడలిలోని రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి వైసీపీ నేతలు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ యువరాజ్, రాష్ట్ర వైసీపీ ప్రధాన కార్యదర్శి పిఎన్ నాగరాజు, రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బాల గురునాథ్, స్థానిక ఉపసర్పంచ్ అక్మల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యక్షులు అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

కార్వేటినగరం: స్థానిక ఎంపీడీవో ఆర్చి వద్ద ఉన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి ఎంపీపీ లతబాలాజీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా వైఎస్ఆర్ జయంతిని నిర్వహించారు. అనంతరం కేక్‌ని కట్ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ శేఖర్ రాజు, రాష్ట్ర యువత ప్రధాన కార్యదర్శి ధనంజయరెడ్డి, స్థానిక సర్పంచ్ ధనంజయ వర్మ, మండల గృహ సారుదుల కన్వీనర్ పురంధర్, మండల కో ఆప్షన్ మెంబెర్ పట్నం ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండలంలోని దేవళంపేటలో 'రైతు దినోత్సవం' వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతిన రైతు దినోత్సవంగా ఆంధ్రప్రదేశ్‌లో జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి గాండ్ల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మేలిపాటి పురుషోత్తం పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రైతు అధ్యక్షుడు పెద్దిరెడ్డిగారి ఉమాచంద్రారెడ్డి, ఎంపీటీసీ కొత్తపల్లి భాస్కర్, దేవళంపేట జడ్పీ ఉన్నత పాఠశాల తల్లి దండ్రుల కమిటీ చైర్మన్ జి.ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఆర్ పురం: మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ 49 కొత్తపల్లి మిట్టలో ప్రధాన వాణిజ్య కూడలిలోని డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి రాష్ట్ర ఆర్టీసీ వైస్ చైర్మన్ ఎంసి విజయానంద రెడ్డి, స్థానిక సర్పంచ్ డివి డిల్లెయ్య ఆధ్వర్యంలో శనివారం పూలమాలవేసి కేక్ కట్ చేసి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జడ్పిటిసి రమణ ప్రసాద్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, విజయబాబు, యేసు రత్నం, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంగవరం: మండలంలోని అన్ని పంచాయతీలు, సచివాలయాల్లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం గంగవరంలోని వైఎస్సార్ కార్యాలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమాలు చేపట్టి, చిత్రపటానికి పాలాభిషేకం చేసి రాష్ట్రానికి వైఎస్సార్ చేసిన సేవలు, సంక్షేమ పథకాలను నాయకులు వివరించారు. పలుచోట్ల కేక్ కట్ చేశారు.

బైరెడ్డిపల్లి: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, వైసీపీ కుటుంబ సభ్యులు కలిసి రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెనుమూరు: వైఎస్సార్ జయంతి వేడుకలు శనివారం మండలంలో వాడవాడలా ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహాసముద్రం జ్ఞానేంద్రరెడ్డి ఆధ్వర్యంలో పెద్దరాజు పల్లె, తోకల చేను, గొడుగుమానుపల్లె, గుంటిపల్లె, చార్వాగాని పల్లె, పెనుమూరులో వైఎస్సార్ విగ్రహాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం భారీ కేకులు కట్ చేశారు. పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షులు మహాసముద్రం సురేష్ రెడ్డి, ఎంపీపీ హేమలత రెడ్డి, జడ్పిటిసి సభ్యులు జి దొరస్వామి యాదవ్, నియోజకవర్గ అధికార ప్రతినిధి కంచర్ల చక్రవర్తి నాయుడు, సింగల్ విండో అధ్యక్షులు కారేటి గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని పురస్కరించుకొని బంగారుపాళ్యం మండలంలోని తగ్గువారిపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న గ్రామాలకు రెండు సంవత్సరాలుగా సమస్యలతో కోర్టులో ఉన్న ఇంటి పట్టాలకు కేటాయించిన గవర్నమెంట్ ల్యాండ్‌ను ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, స్థానిక వైసీపీ నాయకుల చొరవతో క్లియర్ చేసి శనివారం ఇల్లు లేని పేదలందరికీ జగనన్న ఇంటి పట్టాలు పంచిపెట్టారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నగరి: మున్సిపాలిటీ పరిధిలో రాష్ట్ర ఈడిగ కార్పొరేషన్ చైర్ పర్సన్ శాంతి కుమార్ ఆధ్వర్యంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా శనివారం నగరి బస్టాండ్ సర్కిల్‌లోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచారు. ఈ సందర్భంగా 500 మంది పేద మహిళలకు దుస్తుల వితరణ, అన్నదానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ యూనియన్ జనరల్ సెక్రటరీ కేజే కుమార్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పుంగనూరు: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను పుంగనూరులో ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రైవేట్ బస్టాండ్‌లోని వైఎస్సార్ విగ్రహానికి శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ జయంతి వేడుకలను కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ అమర్‌నాథ్ రెడ్డి, మాజీ ఏఎంసీ ఛైర్మన్ నాగరాజు రెడ్డి, జడ్పిటిసి జ్ఞాన ప్రసన్న చంద్రారెడ్డి యాదవ్, జయరామిరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

పెద్దపంజాణి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ జయంతి సందర్భంగా ఎంపీపీ రెడ్డప్ప, మండల కన్వీనర్ భాగరెడ్డి, జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, మండల వైసీపీ నాయకులు మండలంలోని వైఎస్ఆర్ విగ్రహం వద్ద పూలమాలలు వేసి వారికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు రాజశేఖర్ రెడ్డి చేసిన సేవలను, రాష్ట్ర అభివద్ధి గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, వైసీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



నగరి రాష్ట్ర ఈడిగ కార్పొరేషన్ చైర్ పర్సన్ ఆధ్వర్యంలో..

అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ప్రారంభం

ప్రజాశక్తి-పలమనేరు: నియోజకవర్గ స్థాయి అగ్రి టెస్టింగ్ ల్యాబ్ రైతు దినోత్సవం పురస్కరించుకొని పలమనేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హేమంత్ కుమార్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణలు శనివారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ టెస్టింగ్ ల్యాబ్‌లో విత్తనాలు, ఎరువులు, సిఎడిఎల్ వంటి టెస్టింగులు నిర్వహిస్తారని తెలిపారు. ఈ ల్యాబ్‌లో వ్యవసాయ శాఖ తరపున ఇద్దరు ఏఈఓలు, ఏఓ, ఏడీ పశుసంవర్ధకశాఖ తరపున ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లు, ఏడిహెచ్ తమ విధులను నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ సెక్రటరీ సంజీవకుమార్, మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ బాబు, ఆత్మా చైర్మన్ గోవిందరెడ్డి, వ్యవసాయ శాఖ ఏడీఏ అన్నపూరాదేవి, శివకుమార్, పశుసంవర్ధక శాఖ ఏడీహెచ్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-కుప్పం: స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక పిఎస్ మెడికల్ కళాశాల, ఆసుపత్రి వారి సహకారంతో ప్రతినెలా రెండవ శనివారం కుప్పం లయన్స్ క్లబ్ నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ జోనల్ చైర్ పర్సన్ డా.ఎ.మహేష్ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిఇఎస్ మెడికల్ కళాశాల ఆసుపత్రి వారి సమక్షంలో నిర్వహించడంతో ఈ వైద్య శిబిరం ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ వైద్య శిబిరానికి 130 మందికి పైగా కంటి వైద్య పరీక్షలకు వచ్చినట్లు, అందులో 50 మందికి శస్త్ర చికిత్స నిర్వహించాలని వైద్యులు సూచించినట్లు తెలిపారు. శస్త్ర చికిత్సకు సిఫార్సు చేసిన వారిని పిఇఎస్ ఆసుపత్రి వారు అక్కడే వైద్యం అందించడం జరుగుతుందన్నారు. వైద్య శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన సదుపాయాలను ఏర్పాటు చేసి వైద్యానికి వచ్చిన వారికి భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేసినట్లు లయన్స్ క్లబ్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కుప్పం ఇంజినీరింగ్ కళాశాల, లియో లయన్స్ క్లబ్ విద్యార్థులు పాల్గొని వారి సేవలను అందించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు, సెక్రటరీ పీజీ సెల్వం, ట్రెజరర్ ప్రసాద్, డైరెక్టర్లు సోము, చంద్రప్రకాష్, లెనిన్, శివ ప్రసాద్, శివ కుమార్, కష్ణమూర్తి, పిఇఎస్ ఆస్పత్రి వైద్యులు, కుప్పం ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ గంగాధర్, కుప్పం సమాచార సభ్యులు కరీం, వారి బందం పాల్గొన్నారు.

పుంగనూరులో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి-పుంగనూరు: ప్రాజెక్టుల పేరుతో ప్రభుత్వం మా వద్ద నుండి భూములు లాక్కున్నారని వాటికి ఒక్క రూపాయి కూడా నష్టపరిహారం మాకు చెల్లించలేదని నేతిగుట్లపల్లి ప్రాజెక్టు వద్ద పరిశీలనకు వెళ్లిన టిడిపి నాయకులకు రైతులు మొరపెట్టుకున్నారు. ప్రజలకు భవిష్యత్తు గ్యారెంటీ చైతన్య రథయాత్రను టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించడం జరిగింది. అందులో భాగంగా రాజంపేట పరిధిలో భవిష్యత్తు గ్యారెంటీ చైతన్య రథయాత్ర శనివారం పుంగనూరు నియోజకవర్గంలోకి ప్రవేశించడం జరిగింది. గూడూరు పల్లి గ్రామం వద్ద రథయాత్రకు భారీగా తెలుగుదేశం పార్టీ నాయకులు స్వాగతం పలికారు. నియోజవర్గ ఇన్‌ఛార్జ్ చల్లా రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నియోజవర్గ పరిధిలోని నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా పార్టీ అభిమానులు పాల్గొన్నారు. పుంగనూరు పట్టణ పరిధిలో బస్సు యాత్ర సాగుతూ పట్టణంలోని పేద ప్రజలకు ఇవ్వడానికి టిడిపి అధికారంలో ఉన్నప్పుడు నక్కబండ ప్రాంతంలో ఏర్పాటు చేసిన టిడ్కో ఇండ్లను పార్టీ నేతలు పరిశీలించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలైనా వాటిని పూర్తి చేసి పేద ప్రజలకు అందివ్వడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వారు అన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ కూడలికి చేరుకొని ఎన్టీఆర్ మాజీ ఎంపీ రామకృష్ణారెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్మితమవుతున్న నేతిగుట్లపల్లి ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పరిధిలో భూములు కోల్పోయిన రైతులను ఆదుకోవాలని వారు నాయకులను కోరారు. సుగాలి మిట్ట ప్రాంతంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ

సందర్భంగా టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి, నియోజవర్గ ఇన్‌ఛార్జ్ చల్లా రామచంద్రారెడ్డి ,మాజీ ఎమ్మెల్యే షాజహాన్ భాష ,తెలుగు యువత అధ్యక్షులు శ్రీరామ్ చిన్నబాబు, నియోజకవర్గ పరిశీలికులు దుంపూరి భాస్కర్ యాదవ్‌లు మాట్లాడుతూ జాతీయ నాయకులు నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు భవిష్యత్తు గ్యారెంటీ అనే నినాదంతో మా పార్టీ ఆధ్వర్యంలో బస్సుయాత్ర చేస్తుంటే వైసీపీ నాయకులు అడుగడుగునా అడ్డంకులు సష్టిస్తున్నారన్నారు అని ఆరోపించారు. వైసిపి ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినప్పటికీ రాష్ట్రంలో టిడిపి 145 నుండి 150 సీట్లు గెలిచి అధికారం చేపట్టడం ఖాయమని వారు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నేతలు సురేంద్ర యాదవ్, దొరస్వామి నాయుడు, శ్రీకాంత్, సుహేల్ భాష, ఆసురి బాలాజీ, నియోజకవర్గ, మండల, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

కోర్టు బంగ్లా ఆవరణలో పాము హల్‌చల్

ప్రజాశక్తి-నగరి: కోర్టు బంగ్లా ఆవరణలో శనివారం సాయంత్రం 7 అడుగుల సారపాము చొరబడింది. దీంతో కోర్టు సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. వెంటనే జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ విష్ణువర్మ పాములు పట్టేవారికి సమాచారం అందించగా స్థానికంగా పాములు పట్టేవారు వచ్చి ఆ పామును పట్టేశారు. అడవి ప్రాంతంలో విడిచిపెట్టారు.

రైతులకు సన్మానం

ప్రజాశక్తి-పలమనేరు: రైతు దినోత్సవం సందర్భంగా రైతు నాయకులతో పాటు రైతులకు సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పలమనేరు మండలంలోని ఇరిగేషన్ ఆఫీసు పక్కన గల విశ్రాంత ఉద్యోగి అయిన అబ్బూరి తాతయ్య నాయుడు స్వగృహంలో శనివారం రైతు దినోత్సవం సందర్భంగా 20 మంది పైన రైతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర రైతు నేత ఉమా పతినాయుడు హాజరై మాట్లాడారు. రైతులందరికీ ఏడాదికి ఒకసారి పండుగలా వచ్చే రైతు దినోత్సవాన్ని పురస్కరిం చుకుని మనమందరం ఈ ఒక్కరోజున రైతులందరికీ సెలవు దినంగా పరిగణించి ఈ దినోత్సవాన్ని రైతులతో కలిసి ఘనంగా నిర్వహించుకోవాలని తెలిపారు.

చురుగ్గా మురుగునీటి కాలువ పనులు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: గంగినాయనిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న ఎస్సీ కాలనీలో ఎన్టీఆర్ ప్రభుత్వంలో నిర్మించిన డ్రైనేజీ కాలువ మరమ్మతులకు నోచుకోగా కాలనీవాసులు సర్పంచ్ రేణుక శంకర్ రెడ్డికి తెలియపరచగా ఆయన స్పందించి మండలం ఎంపీపీ రెడ్డప్ప సకారంతో శనివారం నూతన డ్రైనేజ్ కాలువ ఏర్పాటుకు శ్రీకారం చుట్టి తిప్పన్న ఇంటి వద్ద నుండి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ రేణుక శంకర్ రెడ్డి, సచివాలయ సిబ్బంది, వార్డ్ మెంబర్స్, వార్డ్ వాలంటీర్ ప్రభాకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'గడపగడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: సమస్యల పరిష్కారానికే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. శనివారం మండలంలోని వెజ్జుపల్లె పంచాయతీలో హరిప్రసాద్ రెడ్డి, ఎంపిటిసి బాలసుబ్రమణ్యం రెడ్డిల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా వారు పలు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందుతున్నాయా లేదా అని వారిని అడిగి తెలుసుకున్నారు. దీంతో పలు సమస్యలను డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకురాగా మరో 10 రోజుల్లో పంచాయతీ అభివృద్ధికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేస్తానని, గ్రామానికి మౌలిక వసతులు కల్పించాలని సర్పంచ్ హరి ప్రసాద్ రెడ్డికి చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ అనిత, ఎంపీడీవో శ్రీదేవి, తహశీల్దార్ ఇన్బనాథన్, మండల కన్వీనర్ పూర్ణచంద్ర రెడ్డి, వైస్‌ఎంపీపీలు హరిబాబు, బేబీ, నేతలు గుణశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వి.కోట: మండల పరిధిలోని గోనుమాకులపల్లి గ్రామ సచివాలయం పరిధిలో శనివారం నిర్వహించిన గడప

గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో శాసనసభ్యులు వెంకటే గౌడ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు గోనుమాకులపల్లి, తెట్టు, నామాలవంక, మర్రిమాకులపల్లి, బండపల్లి గ్రామాల్లోని ప్రతిగడపకు వెళ్లి ప్రభుత్వపరంగా గతనాలుగు సంవత్సరాలుగా అందుతున్న అభివద్ధి సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ యువరాజ్, మండల పార్టీ కన్వీనర్ బాలగురునాథ్, మండల వైస్ ఎంపీపీలు లక్ష్మణ్ రెడ్డి, తమీం ఖాన్, మాజీ ఏఎంసీ ఛైర్మన్ ప్రహల్లాద, స్థానిక ఎంపీటీసీ చిదంబరం, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

ప్రజాశక్తి-సోమల: మండలంలోని మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరుకు చెందిన పగడాల వారి పల్లె గ్రామంలోని రైతు వెంకటాచలపతి ఇంటి వద్ద ఉన్న గడ్డివామి అగ్నికి ఆహుతి అయింది. ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతి అయిందా లేక ఎవరైనా గడ్డివామికి నిప్పు పెట్టారా అన్న విషయం అర్థం కావడం లేదని రైతు అంటున్నారు. కాగా ప్రమాద విషయం తెలిసిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆపేందుకు చేసిన ప్రయత్నం వధా అయింది. మంటలను అదుపు చేద్దామన్నా వీలు కాకపోవడంతో దాదాపు రూ.లక్ష విలువ చేసే గడ్డి మోపులు అగ్నికి ఆహుతి అయినట్టు, పందిరి కూడా దగ్ధం అయినట్టు రైతు ఆవేదన చెందారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: సొంతింటి కల నెరవేర్చుకోవాలని పూతలపట్టు శాసనసభ్యులు ఎంఎస్ బాబు అన్నారు. శనివారం మండలంలోని తగవారిపల్లి పంచాయతీలో ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం తహశీల్దార్ బిన్ రాజ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఎంఎస్ బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రతి ఒక్కరికీ సొంతిల్లు ఉండాలనే ఉద్దేశంతో సొంతిల్లుకు దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర పాల ఏకిరి కార్పొరేషన్ ఛైర్మన్ కుమార్ రాజా, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రామచంద్ర రెడ్డి, ఎంపీపీ అమరావతి, సర్పంచ్ వాణి ప్రియ, ఎంపీటీసీ హేమచంద్ర, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

కరియమాణిక్య స్వామి ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి-నగరి: పట్టణ పరిధిలోని టీటీడీ అనుబంధంలో ఉన్న కరియమాణిక్య స్వామి ఆలయంలో దాతల సహకారంతో ప్రారంభించిన అన్నదాన కార్యక్రమం శనివారం జరిగింది. ముందస్తుగా పేరు నమోదు చేసుకొని విరాళాలు అందించిన దాతల సహకారంతో అన్నదానం చేస్తున్నట్లు టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు వెంకటరమణ, గుణశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో దాతలు, భక్తులు పాల్గొన్నారు.